## క్లుప్తంగా

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.జాహ్నవి ఆదివారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

### ఆనందోత్సాహాలతో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పెనుగంచిప్రోలు: స్థానిక ఎస్ఎస్‌పీఎం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 2007–08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న పూర్వవిద్యార్థులంతా హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల నాటి స్మృతులను గుర్తు చేసుకుని ఆత్మీయంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నాగలక్ష్మి, నల్లూరి పద్మ, నిరంజన్, కాంత తదితరులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 16ఏళ్ల తరువాత అందరం ఒకచోట కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

### మద్దులమ్మ తల్లికి పూజలు

గొట్టుముక్కల(కంచికచర్ల): మండలంలోని గొట్టుముక్కల రిజర్వు ఫారెస్ట్‌లో కొలువైఉన్న మద్దులమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తికమాసం ఆదివారం కావడంతో పలు గ్రామాల ప్రజలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పాలు పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రిజర్వు ఫారెస్ట్‌లో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు మైళ్ల దూరాన్ని సైతం లెక్క చేయకుండా లారీలు, ఆటోల్లో తరలివెళ్లిన భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

### పేకాడుతున్న నలుగురి అరెస్ట్

కంచికచర్ల : మండలకేంద్రం కంచికచర్ల శివారులో పేకాడుతున్న నలుగురిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బోనగిరి రాజు తెలిపారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ వివరించారు.






## అమ్మవారికి దీపాల అలంకరణ



దీపాల అలంకరణలో అంకమ్మవారు

పెనుగంచిప్రోలు: కార్తికమాస ప్రత్యేకాలంకరణల్లో భాగంగా పెనుగంచిప్రోలు శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు ఆదివారం దీపాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూల అలంకరణ, సెలవుదినం నేపథ్యంలో భక్తులు భారీసంఖ్యలో తరలిరావడంతో క్యూలెన్లు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివార్ల పూల అలంకరణకు శ్రీశైలంనకు చెందిన వెంకటశేషగిరిరావు, ఉమామహేశ్వరి దంపతులు సహకారం అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో భూపతిరాజు వెంకట సత్య నాగకిషోర్‌కుమార్, ఏఈఓ ఉమాపతి, తిరుమలేశ్వరరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



దీపాల అలంకరణలో
శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారు

### ఒక్క అర్జీ కూడా రాలేదు

కంచికచర్ల: ఓట్ల మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం కంచికచర్ల మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న 56 పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజులపాటు బీఎల్వోలు అందుబాటులో ఉన్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ పి.జాహ్నవి మాట్లాడుతూ 56 పోలింగ్‌కేంద్రాల పరిధిలో ఓట్ల చేర్పులు, మార్పులు, తొలగింపు కోరుతూ ఒక్క అర్జీ కూడా అందలేదని తెలిపారు.



## టీచర్ల సంక్షేమానికి నిరంతర పోరాటం



ప్రమాణ స్వీకారం చేస్తున్న యూటీఎఫ్ నందిగామ, చందర్లపాడు మండల కమిటీలు

నందిగామ టౌన్: ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తోందని యూటీఎఫ్ నాయకులు బెనర్జీ, ఆలవాల సుందరయ్య, మన్నేపల్లి కృష్ణయ్య, సంజీవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక యూటీఎఫ్ భవనంలో మండల స్వర్ణోత్సవ మహాసభలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పొందుతున్న సౌకర్యాలన్నీ పోరాడి సాధించుకున్నవే తప్ప ఎవరి దయాదాక్షిణ్యాలపై వచ్చినవి కావన్నారు. ఉద్యోగులకు రీగ్రూపింగ్ స్కేల్, త్రిపుల్ బెనిఫిట్ స్కీం, అప్రెంటిస్ విధానం రద్దు వంటి ఎన్నో పోరాడి సాధించుకున్నామని గుర్తుచేశారు. పీఆర్సీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఉపాధ్యాయులకు నెలవారీ ప్రమోషన్‌లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం నందిగామ మండల కమిటీ గౌరవాధ్యక్షునిగా ములుగు శ్రీనివాసరావు, అధ్యక్షునిగా బెనర్జీ, ప్రధానకార్యదర్శిగా చిన్నం నరసింహారావు, చందర్లపాడు మండల గౌరవాధ్యక్షునిగా భూక్యా సీతారాం, అధ్యక్షునిగా పెంటమాల రామారావు, ప్రధానకార్యదర్శిగా బిట్టు సత్యనారాయణలతోపాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం పదవీ ప్రమాణస్వీకారం చేసింది. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మహేశ్వరం వెంకటేశ్వరరావు, కుంచం లక్ష్మీనారాయణ, జంగాల గంగరాజు, వెంకటరమణ, కోటేశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు.

## వరద బాధితులను ఆదుకోవాలి : సీపీఎం



నందిగామలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు గోపాల్ తదితరులు

నందిగామటౌన్: వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం నందిగామ కార్యదర్శి కటారపు గోపాల్ అన్నారు. పట్టణంలోని ఏడు, ఎనిమిది వార్డుల్లో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీస్థలాల్లోకి వర్షపు, వాడుక నీరు చేరి దోమలు వృద్ధిచెందుతుండటంతో ప్రజలు అవస్థలుపడుతున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరల విపరీతంగా పెరగడంతో ఇబ్బందులుపడుతున్నట్లు ప్రజలు తమ దృష్టికి తెచ్చారన్నారు. రాష్ట్రంలో అత్యాచారాలు, అఘాయిత్యాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. బాబు వస్తే జాబు వస్తుందని ఆశతో ఉన్న యువతకు నిరాశే మిగిలిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు సయ్యద్ ఖాశీం, వల్లూరు రవిశేఖర్, గోపీ నాయక్, ఆకుల వెంకట నారాయణ, పత్తిపాటి తిమ్మయ్య పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



జగ్గయ్యపేటఅర్బన్: ఈ విద్యా సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన పట్టణంలోని జీవీజే జెడ్పీ బాలుర హైస్కూల్‌కు చెందిన గార్లపాటి చంద్రశేఖర్‌ను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అభినందించారు. తన నివాసంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే తాతయ్య ఘనంగా సత్కరించారు. చిల్లకల్లు సైన్స్ కాంప్లెక్స్ సెక్రటరీ జిల్లేపల్లి సదానంద్, ఉపాధ్యాయుడు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన ఓటు నమోదు ప్రక్రియ

జగ్గయ్యపేట:కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు పరిశీలన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఓటు నమోదుకు 24మంది, చిరునామా సవరణలకు 44మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ తెలిపారు.

## మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ అభినందనీయం



విగ్రహాలను ఆవిష్కరించిన మంద కృష్ణమాదిగ, ఎమ్మెల్యే సౌమ్య తదితరులు

కొణతాలపల్లి(వీరులపాడు): మండలంలోని కొణతాలపల్లిలో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతీరావుపూలే విగ్రహాలను ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ అణగారిన వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలనే లక్ష్యంతో ఈ మహనీయులు పోరాడారని గుర్తుచేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దళితుల్లో ఎటువంటి విబేధాలు లేవని రిజర్వేషన్ అనేది కేవలం వాటా మాత్రమేననే విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. మాదిగ జాతి అభ్యున్నతికి చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సీఎం చంద్రబాబు అన్నిరకాలుగా అండగా నిలిచారన్నారు. సుప్రింకోర్టు తీర్పును పరిగణలోనికి కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నంద్రు సౌజన్య, ఎమ్మార్పీఎస్ నాయకులు కొండూరు సంగయ్య, కోట దానియేలు, మందా పిచ్చయ్య మాదిగ, ఏజీపీ నంద్రు శ్రీరామ్మూర్తి, నాయకులు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా



బండిపాలెంలో కార్తిక వనసమారాధన సందడి

బండిపాలెం(జగ్గయ్యపేట):కార్తికమాసం సందర్భంగా స్థానిక బ్రాహ్మణబజార్‌లోని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. మహిళలు కార్తీక పూజలు చేసి ఆటపాటలతో సందడి చేశారు. ఖోఖో, కుర్చీలాట, పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించగా చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.

పెనుగంచిప్రోలులో

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులోని మునేరు అవతల ఉన్న మామిడితోటల్లో ఆదివారం కార్తిక వనసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రా నుంచే కాకుండా తెలంగాణాకు చెందిన వారు భారీసంఖ్యలో తరలివచ్చారు. మహిళలు ఉసిరిచెట్టుకు పూజలుచేసి, శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. ఆర్యవైశ్యులు వనసమారాధనల సందర్భంగా సహపంక్తి భోజనాలు చేశారు. వయస్సుతో సంబంధం లేకుండా అందరూ ఆటపాటలతో హాయిగా గడిపారు. సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు.